సాక్షి
అనకాపల్లి
సోమవారం । 2 । జనవరి । 2023

నూతన సంవత్సర ఆగమన వేళ..



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కశింకోట మండల నాయకులు



ఎంపీ సత్యవతికి డీఆర్వో వెంకటరమణ నూతన సంవత్సర శుభాకాంక్షలు



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి మొక్కను అందిస్తున్న డీఈవో లింగేశ్వరరెడ్డి

అనకాపల్లిటౌన్/తుమ్మపాల/కశింకోట: నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఉత్సాహభరితంగా జరిగాయి. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ అందరూ సందడిగా గడిపారు. దైవ దర్శనం కోసం భక్తులు బారులు తీరడంతో ఆలయాల్లో రద్దీ ఏర్పడింది. అభిమానుల తాకిడితో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల నివాసాలు కిటకిటలాడాయి. కశింకోట నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు మిందిలోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నివాసానికి తరలివెళ్లి పుష్పగుచ్ఛాలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన బృందంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని తదితరులు ఉన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి జిల్లా అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పింఛనుదార్ల సంఘం డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు ఈర్లె శ్రీరామమూర్తి, ఇతర సంఘ నాయకులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వీఆర్వోల సంఘం నాయకులు.. కలెక్టర్, జేసీ కల్పనాకుమారిలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో వివేకానంద చారిటబుల్ ట్రస్టులో ఎంపీ బి.వి.సత్యవతి కేక్ కట్ చేశారు. డీఆర్వో వెంకటరమణ ఎంపీని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పెన్షన్ కానుకతో అవ్వా తాతల్లో ఆనందం



తుమ్మపాలలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధులు



కొత్తపెంటలో ముఖ్యమంత్రి చిత్రపటానికి కేక్ తినిపిస్తున్న పింఛన్‌దారులు

అనకాపల్లి టౌన్: పెరిగిన మొత్తంతో కలిపి పింఛన్లు అందించడంతో వృద్ధుల ముఖాల్లో ఆనందం తొణికిసలాడింది. జిల్లావ్యాప్తంగా ఆదివారం 66.9 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీ వరకు పింఛన్ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ వరకు వృద్ధులకు రూ.2,500 పెన్షన్ ఇవ్వగా.. జనవరి నుంచి రూ.2750లకు పెంచిన విషయం తెలిసిందే. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సొమ్ము అందజేశారు. పలుచోట్ల వృద్ధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

న్యూస్‌రీల్

ఎన్టీఆర్ వైద్యాలయానికి అదనపు సిబ్బంది

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి ముగ్గురు వైద్యులు, ముగ్గురు హెడ్‌నర్సులు బదిలీపై వచ్చి, ఆదివారం బాధ్యతలు స్వీకరించినట్లు వైద్యాలయం సూపరింటెండెంట్ కె.శ్రావణ్‌కుమార్ చెప్పారు. విజయగనరం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి డెంటల్ వైద్యురాలు భానుప్రియ, రేడియాలజిస్టు అర్బియా రహీమ్, కంటి వైద్యులు ఫరీద్ ఉద్దీన్ బదిలీపై ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చారు. బదిలీపై వచ్చిన హెడ్ నర్సులు మంగమ్మ(పార్వతీపురం ఆస్పత్రి), రేణుకాదేవి(అరుకువేలీ), పూనం జ్యోతి(పాడేరు) ఆదివారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశం 4న

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశాన్ని ఈ నెల 4న ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సెమినార్ హాల్‌లో సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తామని గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఎ.డి. పాల్ వచ్చే మూడు నెలల్లో చేపట్టబోయే ఫిల్మ్ ఫెస్టివల్‌పై చర్చించనున్నారని తెలిపారు. కొత్త కార్యవర్గం ఎన్నిక నిర్వహిస్తామన్నారు. కొత్తగా చేరాలనుకునే వారు 9032477463 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు జీవీఎంసీ స్పందన

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం జరగనుంది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరించనున్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

5 వరకు హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ - చెన్నై వారు నిర్వహించే పరీక్షలకు సంబంధించి రూ.10 అపరాధ రుసుముతో ఈ నెల 5 వరకు గడువు పెంచారు. ఇదే చివరి అవకాశమని భీమిలి ఆదర్శప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్రభాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ తదితర 9 పరీక్షలకు హాజరయ్యేవారు వివరాల కోసం 89856 47419లో సంప్రదించాలని కోరారు.

మోదమ్మ ఆలయానికి పంచలోహ గంట



తండ్రితో కలిసి గంటను అందజేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

సాక్షి, పాడేరు: స్థానిక మోద కొండమ్మతల్లి ఆలయానికి 17 కిలోల పంచలోహాల గంటను పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, ఆయన తండ్రి విజయ్‌కుమార్ ఆదివారం అందజేశారు. న్యూఇయర్ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచలోహాల గంటను ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యశాస్త్రికి వారు అందజేశారు.

నేడు పవనగిరి గిరి ప్రదక్షిణ

అడ్డతీగల: ఏజెన్సీలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన అడ్డతీగల పవనగిరి క్షేత్రం సోమవారం ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని పవనగిరి గిరిప్రదక్షిణ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలతో పల్లకీసేవ చేపడతారు. కోలాటం, భజన సంఘాలతో భక్తి గేయాలు ఆలపించే బృందాలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటాయని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు.

ముక్కోటి దేవతలు ఒక్కటయ్యే వేళ..

- వైష్ణవాలయాల్లో నేడు ఉత్తరద్వార దర్శనం
- ఉపమాకలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు



ఉపమాక వెంకన్న ఉత్సవమూర్తులు



క్యూలో వేచి ఉండే భక్తుల కోసం ఏర్పాటు చేసిన పందిళ్లు



అనకాపల్లి దేమునిగుమ్మం వేంకటేశ్వరాలయంలో పుష్పాలంకరణ

నక్కపల్లి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించేందుకు ఉపమాక సహా జిల్లాలోని వైష్ణవాలయాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. మూడు కోట్ల దేవతలకు రాక్షస బాధల నుంచి విముక్తి కల్పించిన రోజు కాబట్టి ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. ఉపమాక క్షేత్రంలో గరుడాద్రి పర్వతంపై దశావతారాల్లో పదో అవతారమైన కల్కి అవతారంగా శ్రీమన్నారాయణుడు వెలిశారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఘనంగా ఏర్పాట్లు చేసింది. తిరుపతి, సింహాచలం, అన్నవరం, భద్రాచలం తదితర వైష్ణవ క్షేత్రాల్లో ముక్కోటి ఏకాదశినాడే ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తే ఉపమాకలో అనునిత్యం ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఇక్కడ గరుడాద్రి పర్వతంపై స్వామివారు కల్కి అవతారంలో స్వయంవ్యక్తమై షడ్భుజాలతో అశ్వారూఢుడై వెలిశారు. 6వ శతాబ్దానికి చెందిన దేవాలయమిది. బ్రహ్మ, నారదుడు ప్రతిష్ఠించిన ఆలయంగా పురాణాలు చెబుతున్నాయి. ముక్కోటి ఏకాదశి నాడు సాయంత్రం స్వామివారిని రంగనాథుడిగా అలంకరిస్తారు. శ్రీదేవి, భూదేవి కాళ్లు వత్తుతున్నట్లుగా అలంకరించి పుణ్యకోటి వాహనంపై ఊరేగిస్తారు.

8 వాహనాల్లో తిరువీధి సేవలు

వైకుంఠ ఏకాదశినాడు ఎక్కడా లేనివిధంగా ఉపమాకలో ఎనిమిది వాహనాల్లో తిరువీధి సేవలు నిర్వహిస్తారు. రాజాధిరాజ వాహనంలో గోదాదేవి అమ్మవారిని, పొన్న వాహనంలో రుక్మిణి సహిత వేణుగోపాలస్వామిని, ఆంజనేయ వాహనంపై సీతారాములను, పల్లకిపై బాలరాముడిని, ఇతర వాహనాలపై తాండవ కృష్ణుడు, ప్రాకార పెరుమాళ్లను ఉంచి తిరువీధి సేవలు నిర్వహిస్తారు.

ఘనంగా ఏర్పాట్లు

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి స్వామివారి ఉత్తరద్వార దర్శనం కోసం వేలాదిమంది భక్తులు తరలివస్తారు. భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయంలో గోపురాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. బేడా మండపం, మహాద్వారం, ధ్వజస్తంభాల వద్ద పూలతో అలంకరించి పందిళ్లు, షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తామని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

నేడు వడ్డాదిలో గిరి ప్రదక్షిణ



శ్రీదేవి, భూదేవితో వేంకటేశ్వరస్వామి

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం గిరి ప్రదక్షిణ నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రతి సంవత్సరం గిరి ప్రదక్షిణ చేస్తారు. వెంకన్న చిత్రపటాలతో భక్తి పాటలు, భజనలు ఆలపిస్తూ కొండ చుట్టూ తిరుగుతారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. ఆదివారం నూతన సంవత్సరాది సందర్భంగా వేలాది మంది భక్తులు గిరిజాంబ కొండపై ఉన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

లఘు చిత్రాల పోటీలు

తుమ్మపాల: జిల్లాలో సాంస్కృతిక, సామాజిక, పర్యాటక సంపద అనే అంశంపై లఘు చిత్రం (షార్ట్ ఫిలిం) పోటీలు నిర్వహిస్తున్నట్లు సహాయ కలెక్టర్ ధాత్రిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా లఘు చిత్రాలను అందజేయాలన్నారు. వీటి నిడివి ఐదు నుంచి పది నిమిషాలు ఉండాలన్నారు. జిల్లా సహజ సౌందర్యం, ఆధ్యాత్మిక ప్రదేశాలు, సాంస్కృతిక, చరిత్ర, యూఎస్‌పీ అంశాలపై చిత్రీకరించాలన్నారు. పోటీల్లో పాల్గొన్న వారిలో ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులతోపాటు సత్కారం చేస్తామన్నారు. విజేతల లఘు చిత్రాలను పట్టణంలోని నిర్వహించే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామన్నారు.

నేరాల నియంత్రణకు అందరూ సహకరించాలి



రేలారే సాంగ్‌ను రిలీజ్ చేస్తున్న డీఎస్పీ సునీల్

అనకాపల్లిటౌన్: నేరాల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ పోలీసులకు సహకరించాలని డీఎస్పీ బి.సునీల్ కోరారు. ట్రాఫిక్ రూల్స్‌పై రూపొందించిన రేలారే సాంగ్‌ను స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం రిలీజ్ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే దగ్గరలోని పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ట్రాఫిక్ సీఐ టి.శ్రీను, ఎస్ఐ జె.రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



జగదాంబ జంక్షన్ వద్ద మార్వాడీల శోభాయాత్ర (ఇన్‌సెట్) ర్యాలీలో పాల్గొన్న మహిళలు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): విశాఖ ప్రేమ్‌సాగర్ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మార్వాడీలు ఆదివారం భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. పెదవాల్తేర్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర సిరిపురం జంక్షన్, సెవెన్ హిల్స్ ఆసుపత్రి, జడ్జికోర్టు, జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్, కురుపాం మార్కెట్ మీదుగా పాతనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల శ్యాంబాబా ఆలయం వరకు సాగింది. ప్రతి భక్తుడు జెండా చేతపట్టి శోభాయాత్రలో పాల్గొన్నారు. శ్యాంబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం జెండాలను ఆలయంపై ఎగరవేశారు. విశాఖ ప్రేమ్‌సాగర్ ట్రస్టీ సునీల్ బాలాసరియా నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు కమల్ శర్మ, కార్యదర్శి విమల్ బన్సాల్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందిస్తాం

- కేజీహెచ్‌పై పూర్తి అవగాహన ఉంది
- అందరినీ సమన్వయం చేసుకుంటూ పనిచేస్తా
- నూతన సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్



కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ అశోక్ కుమార్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): పేద రోగులకు వైద్య సేవలు ఇంకా మెరుగుపరుస్తామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ అన్నారు. సూపరింటెండెంట్‌గా ఆయన ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీహెచ్‌పై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. తాను ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశానని, 2017 - 19 కాలంలో కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేశానన్నారు. అలాగే కరోనా సమయంలో సీఎస్ఆర్ బ్లాక్ ఇన్‌చార్జిగా పనిచేయడం వల్ల ఇక్కడి పరిస్థితులపై అవగాహన ఉందన్నారు. ఆస్పత్రిలో వైద్యులు, అధికారులు, నర్సులు, మినిస్టీరియల్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది సమన్వయంతో రోగులకు మరింత సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని పేద రోగులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మౌలిక సదుపాయాలు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వైద్యులంతా కలిసి ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర కురువృద్ధుడు ఇక లేరు

- ఉత్తరాంధ్రలో పీవీకి ప్రత్యేక గుర్తింపు
- వివాదరహితుడిగా పేరు
- బీజేపీ శ్రేణుల నివాళులు
- విశాఖలో నేడు అంత్యక్రియలు



చలపతిరావు పార్థివ దేహం వద్ద విషాద వదనాలతో కుటుంబ సభ్యులు



ప్రధాని మోదీతో పీవీ చలపతిరావు (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం : ఆయనో అజ్ఞాత సూరీడు.. అభినవ అల్లూరి... అలుపెరగని సేనాని.. అందరికీ ఆప్తుడు.. అజాత శత్రువు. పదవుల కంటే విలువలకే ప్రాణమిచ్చి సైద్ధాంతిక నిబద్ధతతో ప్రజాజీవితాన్ని గడిపిన మహర్షి. ఆశయ సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని, ఉపాధి కోసం ఎంచుకొన్న న్యాయవాద వృత్తిని తృణప్రాయంగా వదిలేసి వేల మంది జీవితాల్లో వెలుగులు నింపిన కార్మిక నేత, ప్రజా సేవకుడాయన. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఆయన పేరు ఎరుగని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఆయనే భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ఆ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు పీవీ చలపతిరావు (87). గత కొంతకాలంగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం మధ్యాహ్నం కన్నుమూశారు. పార్థివదేహాన్ని పిఠాపురం కాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

అంచెలంచెలుగా ఎదిగి..

పదేళ్ల ప్రాయంలోనే ఆర్ఎస్ఎస్ భావాలు పుణికిపుచ్చుకున్న ఆయన తదనంతర కాలంలో అంచెలంచెలుగా ఎదిగారు. వివిధ ఉద్యమాలు, ఆందోళనలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, వివాదరహితుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1951లో రాయలసీమ కరువు సమయంలో అక్కడి వారి కోసం స్వయం సేవకులతో కలిసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నగదు, సహాయ సామగ్రి వంటివి సేకరించడం, 1950-54 మధ్య విశాఖ పరిసరాల్లోని కాలేజీలు, యూనివర్సిటీల్లో ఏబీవీపీ యూనిట్ల ఏర్పాటు, భారతీయ జనసంఘ్ కార్యకలాపాల నిర్వహణ, గోవా విముక్తి ఉద్యమంలో పాల్గొనడం వంటివి ఆయన నాయకత్వ పటిమను చాటాయి. రాజకీయాల్లోకి చేరడం కోసం తన పారిశ్రామిక విస్తరణ అధికారి ఉద్యోగాన్ని విడిచిపెట్టారు. బీఎస్సీ, బీఏ, బీఎల్ పట్టాలు పొందిన పీవీ బార్ కౌన్సిల్‌లో సామాజిక న్యాయం కోసం పనిచేశారు. 1967-68లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం, గోదావరిపై పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం న్యాయవాద వృత్తిని వదులుకుని జనసంఘ్‌కు పూర్తి స్థాయి కార్యకర్తగా మారారు. 1972-73లో ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహించినప్పుడు పలుమార్లు అరెస్టయ్యారు. ఉత్తర సర్కార్ జిల్లా గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి 1974లో ఒకసారి, 1980లో రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 1975-77 ఎమర్జెన్సీలో లోక్ సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పుడు 19 నెలలు అజ్ఞాతంలో గడిపారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి రైళ్ల నుంచి దూకడం, మారువేషాల్లో తిరగడం వంటివి ఉత్తరాంధ్రలో పీవీకి ప్రాచుర్యాన్ని తెచ్చాయి. విశాఖలోని బీహెచ్‌పీవీ, ఎంఈఎస్, డాక్‌యార్డు, ఎన్ఎస్‌టీఎల్, హెచ్‌పీసీఎల్, పోర్టు, కోరమాండల్ తదితర సంస్థల కార్మిక నాయకుడిగానూ పీవీ వ్యవహరించారు. 1980 నుంచి 1986 వరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన తనయుడు పీవీఎన్ మాధవ్ కూడా ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ల నియోజకవర్గం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.

గురువుగారిగా..

సీనియర్ నేత కావడంతో బీజేపీ శ్రేణులు పలువురు చలపతిరావును గురువు గారు అని సంబోధిస్తారు. ఆ పార్టీ ముఖ్య నేతలు విశాఖ వస్తే ఆయనను కలిసి, యోగక్షేమాలు తెలుసుకుని వెళ్తుంటారు. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో కొన్నేళ్లుగా పీవీ ఇంటికే పరిమితమయ్యారు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఆరిలోవలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కన్నుమూశారు.

బంధువులు, పార్టీ శ్రేణులు, అభిమానుల సందర్శనార్థం పీవీ చలపతిరావు పార్థివదేహాన్ని పిఠాపురం కాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు చావులమదుం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పిఠాపురంకాలనీకి వచ్చి ఎమ్మెల్సీ మాధవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. చలపతిరావు మరణం పట్ల ఎంపీ జీవీఎల్ నరసింహారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

పరవాడ: అనకాపల్లి–గాజువాక రహదారిలో లంకెలపాలెం కూడలి సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని అనకాపల్లి గవరపాలెంకు చెందిన పొలమరశెట్టి హిమకర్(19) అనే విద్యార్థి దుర్మరణం చెందాడు. పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు అందించిన వివరాలు... గవరపాలెంకు చెందిన హిమకర్, మరో ముగ్గురు కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై విశాఖ ఆర్‌కే బీచ్‌కు వెళుతున్నారు. వారు లంకెలపాలెం జీవీఆర్ లేఅవుట్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం హిమకర్ ప్రయాణిస్తున్న వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న హిమకర్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు


అరెస్టయిన గంజాయి స్మగ్లర్లు

కొయ్యూరు: పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పారిపోతున్న ఆరుగురు గంజాయి స్మగ్లర్లను వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 32 కిలోల గంజాయి, ఆరు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ స్వామినాయుడు ఆదివారం తెలిపారు. చీడిపాలెం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చింతపల్లి నుంచి బూదరాళ్ల రహదారి మీదుగా కాకరపాడు నుంచి ఏలేశ్వ రం వెళ్లేందుకు రెండు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వస్తున్నారని తెలిపారు. పోలీసులను చూడగానే వారు వాహనాలు వదిలి పారిపో యేందుకు ప్రయత్నించారు. కొయ్యూరు,మంప ఎస్ఐలు రాజారావు, లోకేష్ కుమార్‌లు వెంటనే అప్రమత్తమై వెంబడించి వారిని పట్టుకున్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కుందూరుకు,అల్లూరి సీతారామ రాజు జిల్లా రాజవొమ్మంగి, చింతపల్లికి చెందిన నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు.

నేటి నుంచి సమ్మెటివ్-1 పరీక్షలు

- ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ప్రశ్నపత్రాల రూపకల్పన
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 1,91,800 విద్యార్థులు
- పేపర్లను లీక్ చేస్తే కోడ్ సంఖ్య ఆధారంగా గుర్తింపు


అనకాపల్లి ఎమ్మార్సీలో భద్రపర్చిన సమ్మెటివ్-1 పరీక్ష ప్రశ్నపత్రాలు


పాఠశాలలవారీగా పరీక్ష ప్రశ్నపత్రాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మెటివ్–1 పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు ఈ నెల పదో తేదీ వరకూ నిర్వహించేలా షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) విడుదల చేసింది. అనకాపల్లి జిల్లాలో 1,91,800 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్నపత్రాలు ఉమ్మడి జిల్లా డీసీఈబీ నుంచి ఎమ్మార్సీ కేంద్రాలకు అక్కడ నుంచి పాఠశాలలకు చేరుకున్నాయి. ఎమ్మార్సీ కేంద్రాల్లో పరీక్ష ప్రశ్నపత్రాలను పాఠశాలలు వారీగా విద్యార్థుల సంఖ్యను బట్టి ట్రంకు పెట్టెల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచారు. ఏరోజుకారోజు వీటిని హెచ్ఎంలు ఎమ్మార్సీ కేంద్రాల నుంచి తీసుకెళ్లాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి వరకూ ఈ నెల 2వ తేదీ నుంచి, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతులకు ఈ నెల 4వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటొ నుంచి ఎనిమిదో తరగతి వరకూ ద్విభాషా విధానంలో (బైలింగ్యువల్) ప్రశ్నపత్రాలను విద్యార్థులకు అందజేస్తారు. 9, 10 తరగతి విద్యార్థులకు మీడియం వారీగా ప్రశ్నపత్రాలు ఇస్తారు. ప్రతీ ప్రశ్నపత్రంపై జిల్లాకు సంబంధించి సీక్రెట్ క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా వ్యవస్థలతో పాటు అన్ని ప్రైవేట్ యాజమాన్యాలు సమ్మెటివ్ -1 పరీక్షలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సి ఉంది. ప్రశ్నపత్రాలు లీకవ్వకుండా విద్యా శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టింది. పరీక్ష పేపర్లను ఎవరైనా లీక్ చేస్తే కోడ్ సంఖ్య ఆధారంగా ఏ పాఠశాల నుంచి లీకైందో క్షణాల్లో గుర్తించవచ్చునని విద్యాశాఖాధికారులు తెలిపారు.

పరీక్షల సమయం ఇలా ?

ప్రాథమిక తరగతులకు సంబంధించి ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. 6, 8, 10 తరగతులకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకూ 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 4:45 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి.

వేడుకగా వరాహలక్ష్మీనృసింహ స్వామి చందన పూజ


వరాహ లక్ష్మీనృసింహస్వామి చందన పూజ

మునగపాక: స్థానిక నందీశ్వర ప్రాంగణంలో ఆదివారం రాత్రి వరాహలక్ష్మీనృసింహస్వామి చందన పూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. సింహాద్రప్ప మాలలు ధరించిన భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. వరాహ లక్ష్మీనృసింహ స్వామి నామస్మరణతో మునగపాక మార్మోగింది. ఈ సందర్భంగా వారు ఆలపించిన పలు గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముందుగా 108 కలశాలతో మహిళలు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఆరు వరి కుప్పలు దగ్ధం


దగ్ధమవుతున్న వరి కుప్పలు

రావికమతం: గుడ్డిప గ్రామంలో ఆదివారం ఆరు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. ఆ గ్రామానికి చెందిన యన్నంశెట్టి వెంకునాయుడు, గణేష్, రాజు,అప్పలనాయుడు,ఇందల పెంటయ్య,చెన్నంశెట్టి రాము,కర్రి వెంకయ్య,పిల్లా మహాలక్ష్మి,గల్లారాజు ఇటీవల తమ వరి చేనును కోసి స్థానిక పాలకేంద్రానికి సమీపంలో కుప్పలు పెట్టారు. ఈ కుప్పల నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. రావికమతం అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు శ్రమించినా ఫలితం లేకపోయింది. సమీపంలో ఉన్న మరో ఐదు వరికుప్పలకు మంటలు వ్యాపించకుండా రక్షించగలిగారు. దారిన పోయేవారు కాల్చిన సిగరెట్ అర్పకుండా కుప్పలపై విసిరేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.2లక్షల మేర నష్టం జరిగినట్టు అంచనా. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

ధమాకా విజయం సాధించడం ఆనందంగా ఉంది

- దర్శకుడు నక్కిన త్రినాథరావు


నక్కిన త్రినాథరావును సత్కరిస్తున్న మళ్ల సురేంద్ర

అనకాపల్లిటౌన్: ధమాకా విజయం సాధించడం ఆనందంగా ఉందని ఆ సినిమా దర్శకుడు నక్కిన త్రినాథరావు తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన స్థానిక రాజా థియేటర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు అనకాపల్లి థియేటర్‌లో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సినిమా విజయవంతమైన సందర్భంగా ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో అగ్రహీరోలతో మరిన్ని సినిమాలు తీసేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. నక్కిన త్రినాథరావును టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ల సురేంద్ర సత్కరించారు.

నక్కపల్లిలో హాకీ అకాడమీ ఏర్పాటుకు కృషి

- పాయకరావుపేట ఎమ్మెల్యే బాబూరావు
- ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం


ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, బీఎస్ హాకీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ఆదివారం ముగిశాయి. నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి అండర్ – 19 విభాగంలో బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో విజేతగా వైఎస్సార్‌కడప జట్టు, బాలికల విభాగంలో తూర్పుగోదావరి జట్టు నిలిచాయి. విజేతలకు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ తర్ఫీదు పొందుతున్న క్రీడాకారులు రాష్ట్ర, అంతర్రాష్ట్ర పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. నక్కపల్లి హాకీ క్లబ్‌కు క్రీడా మైదానం కేటాయించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. నక్కపల్లిలో హాకీ అకాడమీ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఇక్కడ హాకీని పరిచయం చేసి మంచి క్రీడాకారులను తయారు చేస్తున్న ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబును అభినందించారు. గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రపంచానికి పరిచయం చేస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ రత్నకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాడగట్ల పాపారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, పార్టీ సీనియర్ నాయకులు శీరం నర్సింహమూర్తి, శేషారత్నం, పోటీల రాష్ట్ర పరిశీలకురాలు శ్యామల, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రాంబాబు, పీడీ కుందూరు రాజు, బీఎస్ హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, ఎస్ఎంసీ చైర్మన్ కర్రి పద్మ పాల్గొన్నారు.

బాలికల విభాగంలో విజేతగా తూర్పుగోదావరి ...

చివరి రోజు ఫైనల్స్ పోటీల్లో హోరాహోరీగా సాగాయి. బాలికల విభాగంలో వైఎస్సార్ కడప, తూర్పుగోదావరి జిల్లాల జట్లు తలపడ్డాయి. 2-0 తేడాతో తూర్పుగోదావరి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. కడపకు ద్వితీయస్థానం లభించింది. మరో పోటీలో విశాఖపట్నం జట్టుపై 3-2 తేడాతో ప్రకాశం జిల్లా జట్టు విజయం సాధించి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.

బాలుర విభాగంలో వైఎస్సార్ కడప..

బాలుర విభాగంలో పొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జట్లు తలపడ్డాయి. వైఎస్సార్‌కడప జట్టు 2-1 తేడాతో మొదటి స్థానంలో నిలిచింది. నెల్లూరు జట్టుకు ద్వితీయ స్థానం లభించింది. తృతీయ స్థానం కోసం చిత్తూరు, విశాఖపట్నం పోటీపడ్డాయి. 3-0 తేడాతో విశాఖపట్నం గెలుపొందింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయమైనట్టు స్థానికులు తెలిపారు. అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి 108లో తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మీ బాధలు చూసి చలించిపోయా

- ఎస్పీ సతీష్‌కుమార్


చెరువుగుంపులో ఆదివాసీ చిన్నారులతో కలసి న్యూ ఇయర్ వేడుకల్లో ఎస్పీ సతీష్‌కుమార్

వీఆర్‌పురం: జులైలో వచ్చిన గోదావరి వరదల్లో మీరు పడిన అవస్థలను నేరుగా చూసి చలించిపోయానని ఎస్పీ సతీష్‌కుమార్ వడ్డిగూడెం గ్రామస్తులతో అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వరదల సమయంలో ఒక పక్క ఇళ్లలోకి నీరు చేరుతుండగా మరో పక్క రహదారి బంద్ అవడంతో ఇబ్బందులను నేరుగా చూసి చలించిపోయానన్నారు. చిన్నారులతో ముచ్చటించి కేక్ కట్ చేశారు.

'పోలవరం' పూర్తి చేసి వైఎస్సార్ ఆశయం నెరవేర్చాలి

- విభజన హామీలు అమలు కాకపోవడం అన్యాయం
- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ


మాట్లాడుతున్న మాజీ మంత్రి కొణతాల


అనకాపల్లి టౌన్: పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కలను నిజం చేయాలని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ కోరారు. స్థానిక గవరపాలెం కొణతాల ఘాట్ వద్ద ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ఏర్పడి 9 సంవత్సరాలు అవుతున్నప్పటికీ విభజన చట్టంలో హామీలు అమలు కాలేదన్నారు. రైల్వే జోన్ ఏర్పాటు చేసేందుకు రైల్వే మంత్రి విశాఖ వచ్చి స్థల పరిశీలన చేశారని, విశాఖలో మోదీ నిర్వహించిన సమావేశంలో రైల్వే జోన్ ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని మారినప్పటికీ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేయకపోవడంతో నేటికీ వెనుకబాటుతనంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పోలవరం, వంశధార, నాగావళి వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేసినట్లయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. ఉత్తరాంధ్రలో 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడినప్పటికీ, సాగునీరు లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని, అపార్టుమెంట్లలో వాచ్‌మన్లుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. 7 కోట్ల 3 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసినట్లయితే వచ్చే ఏడాదికి 12 కోట్ల మిలియన్ టన్నులకు సామర్థ్యం పెంచవచ్చన్నారు. ఈ ఏడాది ప్లాంట్ 2 వేల కోట్ల లాభాలు ఆర్జించిందని, ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలని ఆయన కోరారు.

వాహనం జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రమణ

రాజవొమ్మంగి: మండల కేంద్రానికి చెందిన మండా రమణ అనే వ్యక్తి ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. తాపీ పనికి వెళ్లిన రమణ బైక్‌పై కింద్ర నుంచి రాజవొమ్మంగి వస్తు లబ్బర్తి వద్ద నాచుపట్టిన కల్వర్టు దాటుతుండగా వాహనం స్కిడ్ అయింది. దీంతో అతని తల, వెన్నుముఖకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న అతడికి స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ శ్రీదుర్గ ప్రథమ చికిత్స అందించారు. అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

మన్యంలో న్యూఇయర్ జోష్


వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు


డుడుమ జలపాతం వద్ద వాహనాల రద్దీ


చాపరాయిలో సందడి చేస్తున్న పర్యాటకులు

సాక్షి, పాడేరు: వంజంగి హిల్స్‌పై ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా అయ్యారు. ఫొటోలు తీసుకుని పరవశించిపోయారు.

కొత్తపల్లి జలపాతానికి పర్యటకుల తాకిడి

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పోటెత్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలకు ఆదివారం సెలవు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా ఒడిశాలో పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. జలపాతం వద్ద ఉత్సాహంగా గడిపారు.

చాపరాయిలో పర్యాటకుల సందడి

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం మైన చాపరాయి జలపాతం వద్ద ఆదివారం మైదన ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. గిరిజన మహిళల థింసా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బేంబూ చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి.

డుడుమ జలపాతానికి..

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన డుడుమ జలపాతం సందర్శనకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. నూతన సంవత్సరం, ఆదివారం సెలవు కావడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం వద్ద పర్యాటకుల సందడి వాతావరణం నెలకొంది. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆహ్లాద వాతావరణంలో గడిపారు. భారీగా పర్యాటకులు తరలిరావడంతో డుడుమ జలపాతం వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కిక్కిరిసిపోవడంతో పర్యాటకులు అవస్థలు పడ్డారు.

బొర్రా గుహలు కళకళ


వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల సందడి

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు, నూతన సంవత్సరం రోజునా పర్యాటకులు పోటెత్తారు. 6300 మంది గుహలను అందాలను తిలకించగా, సుమారు రూ.ఐదు లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. కటికి, తాటిగుడ, చిట్టంపాడు, సరియా జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ తదితర సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకు కళకళలాడాయి. పర్యాటకులు రాకతో అరకు–విశాఖ ప్రధాన రహదారి రద్దీగా మారింది.


కొత్తపల్లి జలపాతానికి భారీగా తరలివచ్చిన పర్యాటకులు

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు, వైఎస్సార్ సీపీ నేతలు

అనకాపల్లి రూరల్: జనవరి నుంచి పెన్షన్‌దారులకు ప్రభుత్వం అదనంగా రూ.250 పెంచడంతో రూ.2,750 చొప్పున పెన్షన్ ఒక్కొక్కరికి అందుతోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసుకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఆదివారం పెన్షన్‌దారులతో పాటు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మపాల కొణతాల దిబ్బ వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దంతులూరి దిలీప్ కుమార్, తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, అనకాపల్లి మండల పరిషత్ వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు



వైకుంఠ ద్వార దర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని నాగులాపల్లి సీతారాముల ఆలయంలో సోమవారం వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ట్రస్టీ మళ్ల బాబూరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మహిళా భక్తులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబూరావు, వాసు మాట్లాడుతూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు రాత్రి వరకు కొనసాగుతాయన్నారు.

చోడపల్లిలో వస్త్రాల పంపిణీ



వస్త్రాలు అందజేస్తున్న పాస్టర్ రాజశేఖర్

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లిలోని క్రీస్తు మందిరం పాస్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం వస్త్రాలు పంపిణీ చేశారు. బేడ, బుంగళ కాలనీకి చెందిన 40 మందికి రాజశేఖర్ వస్త్రాలు అందజేశారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
ఎస్ 5(నో ఎగ్జిట్)	-సత్యనారాయణ స్క్రీన్-1
అవతార్-2	-సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
అవతార్-2	-పర్తిసాయి
టాప్‌గేర్	-వెంకటేశ్వర
లక్కీ లక్ష్మణ్ (మార్నింగ్, మేట్నీ)	
రాజయోగం (ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
అవతార్-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 89 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-3 యూనిట్లు, ఓ పాజిటివ్-51 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 223 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 169 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

కోటి పుణ్యాల సాటి ముక్కోటి

హిందువుల పండగలన్నీ అయితే చంద్రమానం లేదా సౌరమానం ప్రకారం నిర్వహిస్తారు. కానీ ఈ రెండింటి కలయికతో ఆచరించే ఏకైక పండగ ముక్కోటి ఏకాదశి. ఈ రోజున ముక్కోటి దేవతలంతా ఒక్కటై విష్ణుమూర్తిని దర్శించుకున్నారని పురాణ గాథ. అందుకే ఈ రోజుకు ముక్కోటి ఏకాదశి అన్న పేరొచ్చిందట. ఇదే రోజున మధుకైటభులనే రాక్షసులకు శాపవిమోచనం కలిగించి, వారికి వైకుంఠ ద్వారం వద్ద దర్శనాన్ని అనుగ్రహించాడట శ్రీమహావిష్ణువు. తమలాగే ఎవరైతే ఈ రోజున వైకుంఠ ద్వారాన్ని పోలిన ఉత్తరద్వారం ద్వారా స్వామిని దర్శించుకుంటారో.. వారికి మోక్షాన్ని ప్రసాదించమని స్వామిని వేడుకున్నారట వారు. ఈ ఏకాదశినాడే వైకుంఠంలోని విష్ణుమూర్తి ఆంతరంగిక ద్వారాలు తెరుచుకున్నాయి కాబట్టి దీనికి 'వైకుంఠ ఏకాదశి' అనే పేరు స్థిరపడినట్టు పురాణాలు చెప్తున్నాయి.

- వైకుంఠ ఏకాదశికి వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు
- ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక చర్యలు
- ఆలయాలకు వచ్చే భక్తులు మాస్కులు ధరించడం తప్పనిసరి

అనకాపల్లిటౌన్/కశింకోట: ముక్కోటి ఏకాదశికి వైష్ణవాలయాలు ఘనంగా ముస్తాబయ్యాయి. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమానమని చెబుతారు. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయని ప్రతీతి. మహాభారత యుద్ధంలో అర్జునిడికి భగవద్గీతను కృష్ణుడు ఇదే రోజున ఉపదేశించాడని నమ్మకం. ఇంతటి పవిత్రమైన రోజు కావడంతో సోమవారం వైష్ణవ ఆలయాలు ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలతో భక్తిపారవశ్యంలో మునిగితేలనున్నాయి.

అనకాపల్లిలో..

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని పట్టణంలో దేమునిగుమ్మం, గాంధీనగరం, సుంకరమెట్ట వెంకటేశ్వరస్వామి దేవాలయాలను అంగరంగ వైభవంగా ఆదివారం అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయాల ఈవో రమాబాబు మాట్లాడుతూ సోమవారం తెల్లవారు జామునుంచి ఆలయాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. తెల్లవారు జామున రెండు గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఆయన కోరారు.

కశింకోటలో..

● గవరపేటలో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం భారీ స్థాయిలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. మండలంలో మొదటిసారిగా ఇక్కడే పదేళ్ల క్రితం కడప నుంచి రప్పించి వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఏటా ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తూ వైకుంఠ ఏకాదశి రోజున పెద్ద ఎత్తున కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని 108 మంది భక్తులతో గుడి ప్రదక్షిణ చేస్తారు. రాత్రి ఇక్కడి శారదానదిలో స్వామి వారి కల్యాణోత్సవ విగ్రహాలను ఉంచి తాటి దోనెలపై అలంకరించి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం రాత్రి ఊయల సేవ, పవలింపుసేవ, పుష్పాంజలి నిర్వహించడంతో కల్యాణోత్సవం ముగుస్తుందని ది. ఎప్పటిలాగే పెద్ద ఎత్తున వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని జరిపించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, అధ్యక్షుడు భీశెట్టి కల్యాణ చక్రవర్తి తెలిపారు.



ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వైకుంఠ ద్వార దర్శనానికి సన్నాహాలు



ఊరేగింపు సేవకు సిద్ధమైన గజ, గరుడ వాహనాలు



కల్యాణోత్సవానికి సిద్ధం చేస్తున్న వేదిక

● కశింకోటలోని దేవదాయ, ధర్మదాయ శాఖకు చెందిన పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు ఉత్తర ద్వారం వైపు గోపురాలు, ఆలయ గోపురాలకు యువ చారిటబుల్ ట్రస్టు సహకారంతో అందంగా రంగులు వేశారు. చలువ పందిరి వేసి వైకుంఠ ద్వారం వద్ద భక్తుల ప్రవేశానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, వైకుంఠ ద్వార దర్శన పూజలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాప ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతా రామాచార్యులు, రేజేటి మారుతి తెలిపారు. గజ వాహనంపై రాముడు, గరుత్మంతుని వాహనంపై వేణుగోపాల స్వామి విగ్రహాలను గ్రామంలో ఊరేగించనున్నట్లు చెప్పారు.

● శివాలయం వద్ద ఉన్న ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు.

పింఛన్.. ఆనందం పెంచెన్

పరవాడ: అవ్వా తాతల కళ్లలో ఆనందం కనిపించింది. నూతన సంవత్సరం రోజున కొత్త పింఛన్ అందుకున్న వారు మరింత భరోసా లభించిందని సంతోష పడ్డారు. కొత్తగా మంజూరైన.. పెంచిన పింఛన్లను వలంటీర్లు ఆదివారం ఉదయం 6 గంటలకే లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమానికి నడుం బిగించారు. వలంటీర్లతో కలిసి ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. మళ్లీ జగన్ బాబు సీఎం కావాలని వారంతా ఆశీర్వదించారు.

● మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో కూండ్రపు సీతారామయ్య లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజాన ముత్యాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు కృష్ణబాబు, కె.దాదా నాయుడు, బండారు శ్రావణ్, రొంగలి గంగరాజు, యమహానాయుడు, కె.అప్పలనాయుడు, దొడ్డి రాజేష్, మాసవరపు సత్యవతి, వలంటీర్లు పాల్గొన్నారు.

● వాడచీపురుపల్లిలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ఎంపీటీసీ పుష్పా చంద్రారావు, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, పార్టీ కన్వీనర్ కూండ్రపు తాతాజీ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

● రావాడ గ్రామంలో వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు కావలి వాసు, కావలి రాజు, పల్లా గోవిందు లబ్ధిదారులకు పింఛన్ అందించారు.



వెంకటపతిపాలెంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విసన్నపేటలో 'గడప గడపకు' నేడు

కశింకోట: మండలంలోని విసన్నపేట గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని స్థానికులకు వివరిస్తారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు. అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న పూడిమడక ఎంపీటీసీలు

అచ్యుతాపురం(అనకాపల్లి): రాష్ట్రంలో పెద్ద మత్స్యకార గ్రామాల్లో ఒకటైన పూడిమడకలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పూడిమడకకు చెందిన ఎంపీటీసీలు వాసుపల్లి శ్రీనివాసరావు, పోలవరపు పారునాయుడు, మేరుగు అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు వారు శనివారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

బీజేపీ నేత పి.వి.చలపతిరావు మృతికి సంతాపం

అచ్యుతాపురం(అనకాపల్లి): ఉత్తరాంధ్ర బీజేపీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్ తండ్రి, బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత పి.వి.చలపతిరావు మృతి పట్ల బీజేపీ నేతలు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. యలమంచిలి బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, పూడిమడక బీజేపీ నేత మేరుగు కాసు బాబు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్



ఎంపీ సత్యవతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ సునీల్, పట్టణ సీఐ దాడి మోహనరావు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావును సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు



ఎంపీపీ కార్యాలయంలో న్యూ ఇయర్ సందర్భంగా పుష్పగుచ్ఛాలందిస్తున్న సిబ్బంది



కార్పొరేటర్ మందపాటి సునీత దంపతులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు



జిల్లా న్యాయమూర్తి ఫణికుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు



కశింకోట ఆంధ్ర కల్వరి సెంచురీస్ బాప్టిస్టు చర్చిలో న్యూ ఇయర్ ప్రార్థనలు



కశింకోటలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముందు వేసిన రంగుల ముగ్గులు

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

అనకాపల్లిటౌన్: ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఆదివారం పట్టణంలో సందడిగా జరిగాయి. వివిధ పార్టీల కార్యాలయాలు, నేతల నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాలు, యూనియన్ల భవనాలు కళకళలాడాయి. ఒకరినొకరు ఆత్మీయంగా కలుసుకుని, పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామ రాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ నేతలు కొణతాల మురళీకృష్ణ, సకలా గోవింద్, గైపూర్ రాజు, పలకా రాము, ఉగ్గిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దాడి స్వగృహంలో..

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు కోలాహలంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పుష్పగుచ్ఛాలందించి, శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

● మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొర్లి సూరిబాబుకు ఎంపీడీవో డి.చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది, మండల పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలు అందించారు.

● కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీ సౌజన్య, మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మీ, మాదంశెట్టి చిన్నతల్లి స్వగృహాలకు పార్టీ నేతలు వెళ్లి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్‌ల ఇంటి వద్ద టీడీపీ నేతలు శుభాకాంక్షలు అందించారు.

● మాజీ మంత్రి కొణతాల రామకృష్ణను ఆయన అభిమానులు కొణతాల సుబ్రమణ్యం ఘాట్ వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – మండలంలో తుమ్మపాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ ఇంటిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి.

● ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి బీజేపి జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి వెంకట సత్యనారాయణకు పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.

కశింకోట: మండలంలో శనివారం రాత్రి, ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కశింకోటలోని పురాతన ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్టు చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ గీతాలు పాడారు. క్రీస్తు ప్రవచాలను పాస్టర్ సన్నీజేమ్స్ వివరించారు. సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, చర్చి కమిటీ అధ్యక్షుడు మోజేస్, కార్యదర్శి నాగేశ్వరరావు, బాలికల హైస్కూలు హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న చర్చిల్లో కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఇళ్ల ముందు రంగవల్లులు

గడచిన ఏడాదికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్లు, దుకాణాల ముందు, వీధుల్లో రంగురంగులతో ముగ్గులు వేశారు. శనివారం అర్ధరాత్రి యువకులు కేకులు కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకుంటూ ఉత్సాహంగా గడిపారు. వీధుల్లో తిరుగాడుతూ మిత్రులకు, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, స్థానిక నాయకులకు అభిమానులు, శ్రేయోభిలాషులు, సిబ్బంది పుష్ప గుచ్ఛాలు, పండ్లు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో ఎలాంటి అపశృతుల్లేకుండా ఎస్ఐ ఆదినారాయణరెడ్డి తమ సిబ్బందితో పర్యవేక్షించారు.

అనకాపల్లి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొర్లి సూరిబాబుకు ఎంపీడీవో డి చంద్రశేఖర్, ఈవోఆర్‌డీ ధర్మారావు, పలువురు ప్రజాప్రతినిధులు, సెక్రటరీలు, పుష్పగుచ్ఛాలు అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అనకాపల్లిటౌన్: నూతన సంవత్సరంలో పర్యావరణాన్ని కాపాడి ఆరోగ్యంగా జీవించాలని అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. స్థానిక జిల్లా న్యాయమూర్తి ఫణికుమార్ స్వగృహంలో అసోషియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం న్యాయమూర్తులు గంగరాజు, విజయచందర్, ప్రదీపలకు వారివారి స్వగృహంలో అసోసియేషన్ సభ్యులు కలిసి శుభాకాంక్షలందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి దివాకర్, సభ్యులు జోగారావు, సాయిరాం, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లతో రైతుకు అ'ధనం'

- ఆర్బీకేల ద్వారా కొనుగోళ్లకు సన్నాహాలు
- 90 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- గతేడాది కంటే 22 మెట్రిక్ టన్నులు అధికం



ధాన్యంలో తేమ కొలిచే యంత్రం



కల్లంలో నూర్పిడికి సిద్ధంగా ఉంచిన వరి కుప్పలు

కశింకోట: ధాన్యం కొనుగోళ్లకు మండల యంత్రాంగం సన్నద్ధమయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గతేడాది కంటే ఈ సారి అదనంగా ధాన్యాన్ని సేకరించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు, దిగుబడి కూడా మెరుగ్గా ఉన్నట్టు పంట కోత ప్రయోగంలో తేలింది. దీంతో సుమారు 90 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యం నిర్దేశనం చేసుకున్నారు.

పెరిగిన కొనుగోలు లక్ష్యం

ఈ ఏడాది వరి ధాన్యం కొనుగోలు లక్ష్యం పెరిగింది. గత ఏడాది 68 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. దాన్ని ఈ ఏడాది 90 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ఉన్నతాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళికబద్ధంగా సన్నద్ధం అవుతున్నారు. మండలంలో రైతులు అత్యధిక శాతం మంది సన్న, చిన్నకారులే ఉన్నారు. వారు తమ ఇంటి అవసరాలకు, పశుగ్రాసం వరి పండిస్తారు. పంట బాగా పండితే తమ అవసరాలకు సరిపడా ఉంచుకుని, మిగిలినది విక్రయిస్తారు. ఇప్పటికే దాదాపు వరి కోతలు పూర్తయ్యాయి. కోత కోసిన పంటను సమీపంలోని కల్లాలకు చేర్చి, మరి కొందరు మడుల్లోనే కుప్పలుగా వేసి, నూర్పు సన్నాహాలు చేస్తున్నారు. సాధారణంగా సంక్రాంతికి ముందు సగం నూర్పిడి పూర్తయ్యే అవకాశాలున్నాయి.

నాణ్యత కొలమానంగా కొనుగోలు

నాణ్యతను అనుసరించి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంది. ఇందుకు మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామ వలంటీర్, పీఏసీఎస్‌లో ధాన్యం నాణ్యతను పరిశీలించే సాంకేతిక నిపుణులతో బృందాన్ని ఏర్పాటు చేశారు. ధాన్యం విక్రయానికి ముందుకు వచ్చిన రైతు కల్లాల వద్దకు వ్యవసాయ సిబ్బందితోపాటు సాంకేతిక నిపుణుని పంపిస్తారు. అక్కడ ప్రాథమికంగా పరిశీలించి నాణ్యతగా ఉన్న రకాల ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రంలో ఉన్న తేమను కొలిచే యంత్రం సాయంతో తేమ శాతాన్ని లెక్కిస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు తేమ శాతం సరిపోతే ధాన్యాన్ని కల్లాలకు వెళ్లి కొనుగోలు చేస్తారు. వాటిని వాహనంలో తూనిక యంత్రం వద్దకు తరలించి తూకం వేసి, యలమంచిలిలోని ధాన్యం మిల్లులకు తరలిస్తారు. సోనా, సాంబమసూరి వంటి మేలైన రకాల ధాన్యం క్వింటాల్ రూ.2060, ఆర్జీఎల్ తదితర రకాల ధాన్యం క్వింటాల్ రూ.2040గా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. ఈ మేరకు రైతులకు మూడు వారాల వ్యవధిలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. దీంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

లక్ష్య సాధనకు కృషి

మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది 90 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకు ఏర్పాటు చేసిన బృందంతో ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నాం. ఈ ఏడాది పంట కోత ప్రయోగాల్లో వరి దిగుబడి ఎకరాకు అదనంగా సుమారు 2 క్వింటాలు ఎక్కువగా వస్తున్నట్టు తేలింది. పంట సాగు విస్తీర్ణం కూడా 200 హెక్టార్లు పెరిగింది. ఈ మేరకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నాం.

–ఎం. స్వప్న, మండల వ్యవసాయ శాఖ అధికారి, కశింకోట.